పల్లె పల్లెలో సంక్రాంతుల శోభ

సంస్కృతి సంప్రదాయాల మేళవింపు.. సరదాలు పంచె వేడుక.. మూడు రోజుల మురిపెం.. సంక్రాంతి పర్వదినం.. తెలుగువారి సంప్రదాయ పండగ.. గుండెల నిండుగా.. ఆత్మీయంగా జరుపుకునే ప్రకృతి పండగ. ఇంటిల్లిపాది ఆనందోత్సాహాలతో జరుపుకునే సంక్రాంతి సంబరాల కోసం తరలి వచ్చిన కుటుంబ సభ్యులతో పల్లెలన్నీ సంక్రాంతుల శోభతో సందడిగా మారాయి. తొలి రోజు ఆదివారం తెల్లవారుజామున భోగభాగ్యాల భోగి పండగను కోలాహలంగా జరుపుకున్నారు. సోమవారం పెద్ద పండగ (సంక్రాంతి), మంగళవారం కనుమ పండగలను జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతీయువకులు సంక్రాంతి పండగల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

- తొలి రోజు కోలాహలంగా భోగి మంటలు
- నేడు పెద్ద పండగ



ఆత్మకూరు: చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న పెద్దలు


కావలి: భోగి మంటల్లో తాటాకులు వేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఆత్మకూరు: తెలుగు వారి పెద్ద పండగల్లో తొలి రోజు భోగి పండగను ఆత్మకూరులో యువత ఉత్సాహంగా జరుపుకున్నారు. భోగి పండగలో ప్రధానమైన భోగి మంటలను వేకువజామునే తమ ఇళ్ల ముందు ఇంటిల్లపాది తాటాకులతో మంటలు వేసి భోగి పీడను వదిలించుకున్నారు. మహిళలు తమ ఇళ్ల ముందు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం తలస్నానాలు ఆచరించి నూతన బట్టలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. పట్టణంలోని పురాతన ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయం, జేఆర్‌పేటలోని లక్ష్మీ ఆండాల్ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు కిక్కిరిశారు. భోగి పండగ రోజు చిన్నారులకు భోగి పళ్లు (రేగి పళ్లు) పోయడం ఆనవాయితీ కావడంతో పలు కుటుంబాల్లో చిన్నారులకు తల్లిదండ్రులు భోగి పళ్లు పోసి దిష్టి తీసి ఆ వేడుకను సంప్రదాయంగా నిర్వహించారు.

భోగి కోలాహలం..

సంగం: మండలంలో భోగి పండగ ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. చిన్న పెద్దా తేడా లేకుండా తెల్లవారుజాము నుంచే మొద్దలు, ఎండిపోయిన చెట్ల కొమ్మలను, తాటి మట్టలను, పాత సామాన్లను భోగి మంటలుగా వేసి సంప్రదాయబద్ధంగా ఉల్లాసంగా భోగి పండగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంగంలోని సంగమేశ్వరస్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఉత్సాహంగా భోగి మంటలు

చేజర్ల: సంక్రాంతి పండుగల్లో భాగంగా చేజర్ల మండల వ్యాప్తంగా ఆదివారం వేకువ జామున భోగి మంటలు అంబరాన్ని అంటాయి. భోగి పండుగను పురస్కరించుకొని చిన్నారులు,పెద్దలు తెల్లవారు జామున భోగి మంటల వద్ద ఉత్సహంగా,ఉల్లాసంగా కాలం గడిపారు. అనంతరం స్నానాలు చేసి పూజలు చేసారు. ప్రతి సంవత్సరం జనవరి మాసంలో వచ్చే ఈ పండుగలో పిల్లలు,పెద్దలు నూతన వస్త్రాలు ధరించి హరిదాసుల కీర్తనలు,అందంగా తీర్చన రంగవల్లులు,గంగిరెద్దుల మేళాల మధ్య సాంప్రదాయ బద్దగా జరుపుకొంటారు.

ఆనందోత్సాహాలతో భోగి వేడుకలు

వరికుంటపాడు: వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పర్వదినాల్లో తొలి రోజు భోగి వేడుకలను ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఇళ్ల ముంగిట్లో పోటాపోటీగా భోగి మంటలు వేసుకున్నారు. మహిళలు ఇంటి ముందు రకరకాల రంగవల్లులు తీర్చిదిద్దారు. భోగి మంటలపై వేడి నీళ్లు కాచుకుని స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు వేడుకగా భోగి పండ్లు పోశారు. వలస వాసుల రాకతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.


సంగం: భోగి మంటలు వేస్తున్న యువకులు

ఇంటింటా భోగి సంబరాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామాల్లో ఇంటింటా ఆదివారం తెల్లవారుజామున భోగి సంబరాలు కోలాహలంగా జరిగాయి. తమ ఇళ్ల ముంగిట పిల్లలు, యువకులు, పెద్దలు, వృద్ధులు, మహిళలు తేడా లేకుండా భోగి మంటలు వేస్తూ సందడి చేశారు. ధనుర్మాసం ప్రారంభం నుంచి తమ ఇళ్ల ముంగిట ప్రతి రోజు తెల్లవారుజాము నుంచే రంగవల్లులు తీర్చిదిద్దుకున్న మహిళలు, ఆడ పడుచులు తమలోని ప్రతిభకు మరింత పదును పెట్టారు. మండలంలోని మురగళ్ల, మహిమలూరు తదితర గ్రామాల్లో యువతీ, యువకులు క్రికెట్ పోటీలు ప్రారంభించి కోలాహలంగా పాల్గొన్నారు.

వైభవంగా భోగి వేడుకలు

కలిగిరి: మండలంలోని ప్రతి గ్రామంలో ఆదివారం భోగి వేడుకలను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు వేకువజామునే నిద్ర లేచి భోగి మంటలు వేశారు. మహిళలు, పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇళ్ల ముంగిళ్లలో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా భోగి పండగ

బిట్రగుంట: బోగోలు మండలంలో భోగి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెలుగు వారి పెద్ద పండగ సంక్రాతి వేడుకలకు నాందిగా భోగి మంటలతో సంబరాలకు స్వాగతం పలికారు. అందమైన రంగవల్లులు, పిండి వంటల గుభాళింపులు, భోగి స్నానాలు, కొత్త అల్లుళ్లతో పల్లెలు నూతన శోభను సంతరించుకున్నాయి. సనాతన సంప్రదాయానికి కొనసాగింపుగా వేకువనే బుడబుక్కల వాళ్లు, అమ్మపలుకులతో, జంగమ దేవరులు శంఖు నాదంతో ఇంటింటికీ తిరిగి ఆశీర్వచనాలు అందించారు. స్థానికంగా ఉండే యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భోగి సంబరాల్లో ఎమ్మెల్యే

కావలి: పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం భోగి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే స్వయంగా తెల్లవారుజామున తన నివాసం వద్ద తాటాకులతో భోగి మంటలు వేసి పండగను ఆస్వాదించారు.


ఆత్మకూరురూరల్: మహిమలూరులోని ఓ వీధిలో తెల్లవారుజామున భోగి మంటలు


కలిగిరి: భోగి మంటలు వేస్తున్న చిన్నారులు

ఉత్సాహం భోగి సంబరం

దుత్తలూరు: మండలంలోని గ్రామాల్లో ఆదివారం భోగి పండగ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వారి వారి ఇళ్ల ముందు వేకువ జామునే భోగి మంటలు వేసి చిన్నారులకు భోగి పండ్లను పోశారు. సమీప దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిలకపాడులో దుస్తుల పంపిణీ


మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

మర్రిపాడు: మండలంలోని చిలకపాడులో సర్పంచ్ సిద్ధంరెడ్డి రమా మోహన్‌రెడ్డి సంక్రాంతిని పురస్కరించుకుని మహిళలకు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు దుస్తులు, స్వీటు బాక్సులు పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సేవా స్ఫూర్తిని అనుసరిస్తూ ప్రజలకు సేవ చేయాలనే అంకితభావంతో చేస్తున్నట్లు వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, గోవిందు రమణారెడ్డి, బొర్రా నారాయణరెడ్డి, సిద్ధంరెడ్డి వైభవ్, బొర్రా విష్ణువర్ధన్‌రెడ్డి, బొర్రా గిరిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడి పందేలపై పోలీసుల దాడులు

ఉదయగిరి: మండలంలోని వెంకట్రావుపల్లి, ఆర్లపడియ గ్రామాల సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై ఆదివారం ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి దాడులు నిర్వహించారు. 11 మంది పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని మూడు కోళ్లు, రూ.11,410 నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఆత్మకూరు: ఓ ఇంటి ముందు భోగి మంటను వేస్తున్న కుటుంబం


దుత్తలూరులో భోగి మంటలు వేస్తున్న దృశ్యం


చేజర్ల : మడపల్లిలో భోగి మంటలు వేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

సంతోషంగా జరుపుకోండి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



ఆత్మకూరు: తెలుగు ప్రజల ముఖ్యమైన పెద్ద పండగ సంక్రాంతి అని రైతులు, అన్ని వర్గాల ప్రజలు శుభంగా, సంతోషంగా సంక్రాంతిని జరుపుకోవాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మకర సంక్రమణ సంక్రాంతి పండగ పెద్దలను స్మరించుకొని వారి ఆశీస్సులు అందుకునే పెద్ద పండుగ, కనుమ పండగ రైతుల పండుగ అని, పాడి పంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

బహుమతుల ప్రదానం


బహుమతులను ప్రదానం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

అల్లూరు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా అల్లూరు మండలం ఇస్కపల్లిలో నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అందించారు. ఆదివారం ఇస్కపల్లిలో ఏర్పాటు చేసిన సభలో బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆటల పోటీలు, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ అధ్యక్షుడు బీద రమేష్, నాయకులు, గ్రామ కాపులు తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణం



ఆత్మకూరు: భోగి పండగను పురస్కరించుకుని పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గోదాదేవి వెంకటేశ్వరస్వామిని ఆరాధిస్తూ 'పాశురాలు' రచించి గానం చేసి స్వామికి అంకితమిచ్చింది. ఆయననే వివాహమాడుతానని తండ్రి విష్ణుచిత్తుడితో తెలిపినట్లు పురాణ కథనం. ఆమె భక్తికి మెచ్చిన స్వామి భోగి పండగ రోజు ఆమెను వివాహం చేసుకున్నట్లు కథనం. ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ భోగి నాడు గోదాదేవి కల్యాణం నిర్వహించినట్లు అర్చకులు శ్రీనివాసులుశర్మ, రామయ్యస్వామి వివరించారు.

వైభవంగా గంధమహోత్సవం

- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: స్థానిక కోనేటి సెంటర్‌లోని దాదా–దాదీ దర్గా గంధమహోత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ గంధ మహోత్సవంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా చద్దర్లను శిరస్సుపై ధరించి మోసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు నీలం సాయి కుమార్, పట్టణ అధ్యక్షుడు దండా కృష్ణారెడ్డి, నాయకులు ఊటు శ్రీకాంత్‌రెడ్డి, షేక్ ఉస్మాన్ షరీఫ్, దైవాదీనం, మేడా శ్రీనివాసులరెడ్డి, కరుణాకర్, భాస్కర్, భక్తవత్సలరెడ్డి, రాజీ, ప్రతాప్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


చద్దర్లను తీసుకు వస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అవాస్తవాలు రాయొద్దు

- ఆర్డీఓ కె.మధులత

ఆత్మకూరు: ఓటరు జాబితా నుంచి రెండు నెలల క్రితమే తొలగించిన నలుగురు ఓటర్లను ఇంకా జాబితాలో ఉన్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా అవాస్తవాలు ప్రచురించడం సరికాదని ఆత్మకూరు ఆర్డీఓ కె మధులత శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అనంతసాగరం మండలం మంచాలపల్లిలోని 64వ పోలింగ్ కేంద్రంలో చిన మస్తాన్ కర్నూరం, చిన్నయ్య (చిన్న) కర్నూరం, కొమ్మూరు పద్మమ్మ, పెద్దిరెడ్డి తిరుపతి అనే నలుగురు మృతి చెందారని, అయినా వారి పేర్లు ఇంకా ఓటరు జాబితా నుంచి తొలగించలేదని ఆదివారం ఈనాడులో తప్పుడు వార్తను ప్రచురించారన్నారు. దీంతో ఆర్డీఓ మధులత ఓటరు జాబితాను పరిశీలించి గతేడాది నవంబరు 15న ఆ నలుగురి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించినట్లు, క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలన చేసి కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన సూచనల మేరకు మృతుల పేర్లను తొలగించడంతో పాటు అర్హతలు కలిగిన వారికి ఓటు హక్కు కల్పిస్తూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఆమె తెలిపింది. ఏ మాత్రం వాస్తవం కాని వార్తలను ప్రచురించవద్దని ఆర్డీఓ మధులత పేర్కొన్నారు.


మృతుల పేర్లు.. తొలగని తీరు
ఈనాడులో వచ్చిన అవాస్తవ కథనం

క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ (వైఎస్సార్ టీఏ) జిల్లా క్యాలెండర్‌ను స్థానిక తన నివాసంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని వైఎస్సార్ టీఏ నాయకులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ జాన్, కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్‌రావు, భాస్కర్ నారాయణ, జిల్లా కార్యదర్శులు జిలానిబాషా, నజీమ్, రఫీ, రామకృష్ణ, మస్తాన్‌వలి, సురేష్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రవికాంత్, శ్రీనివాసులు,ఎంటీఎస్ ఉపాధ్యాయులు ప్రసాద్, శ్రీనివాసులు, బాషా, రజని, గురుకులం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాఘవ, శ్రీనివాసులు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.